

వరాల జల్లు కురిసేనా?



- రాఘవాపూర్ -మణుగూర్ రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలి
- పెద్దపల్లి, కరీంనగర్, ఖాజీపేట మార్గాల్లో కొత్త రైళ్లను ప్రారంభించాలి
- బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టుకు నిధులు దక్కేనా..
- జాతీయ రహదారుల మంజూరుపై ఆశలు
- నేడు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నిర్మలాసీతారామన్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి) కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెంచుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న రాఘవాపూర్-మణుగూర్ రైల్వే లైన్‌కు ఏ మేరకు నిధుల కేటాయింపు ఉంటుంది, పెద్దపల్లి నుంచి నిజామాబాదు మార్గాన్ని డబుల్ మార్గంగా విస్తరణకు అడుగులు పడతాయా, కరీంనగర్, పెద్దపల్లి, ఖాజీపేట మార్గాల్లో కొత్త రైళ్లు నడవనున్నాయా, బసంత్‌నగర్ మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా, లేదా అనే చర్చ జరుగుతున్నది. శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు.

భూసేకరణతో ఆశలు..

కోల్ కారిడార్‌ను కలిపేందుకు 20 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన రాఘవాపూర్ (పెద్దపల్లి)-మణుగూర్ 206 కిలోమీటర్ల సింగిల్ విద్యుత్ రైల్వే లైన్ నిర్మాణానికి రెండు దశాబ్దాల తర్వాత గత ఏడాది కేంద్ర ప్రభుత్వం భూసేకరణకు గెజిట్ జారీ చేసింది. దీంతో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజల్లో ఆశలు చిగురించాయి. ఈమార్గానికి ఈ బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయిస్తే పనులు ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి. ఈ మార్గం పూర్తయితే పర్యాటకంగా, సరకు రవాణా పరంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది, ఈ మార్గానికి ఇప్పటికే పర్యావరణ శాఖ నుంచి అనుమతులు కూడా వచ్చాయి.

మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వే మార్గం..

హైదరాబాదు నుంచి ఢిల్లీకి ప్రత్యామ్నాయ మార్గమైన మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి (కరీంనగర్) రైల్వే మార్గానికి ఈ బడ్జెట్‌లో అధిక నిధులు వెచ్చిస్తే వచ్చే మూడేళ్లలో ఈ మార్గం పూర్తయి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈమార్గం పనులు సిరిసిల్లలో ప్రారంభం అయ్యాయి. సికింద్రాబాద్-కాజీపేట-పెద్దపల్లి మార్గం రద్దీగా మారింది. దీనిని అధిగమించాలంటే ఈ మార్గం త్వరగా అందుబాటులోకి రావాలి.

కొత్త రైళ్లను నడపాలి..

పెద్దపల్లి, కరీంనగర్ మార్గాల గుండా పలు కొత్త రైళ్లను నడిపిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ వరకు వయా పెద్దపల్లి మీదుగా వందే మెట్రో (నమో భారత్ ర్యాపిడ్) ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించాలని, నిజామాబాదు నుంచి వరంగల్ వయా పెద్దపల్లి మీదుగా మెము ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలనే ప్రతిపాదన ఐదేళ్లుగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. హైదరాబాదు నుంచి వయా నిజామాబాదు, కరీంనగర్, పెద్దపల్లి, బల్లార్షా మార్గంలో ఢిల్లీకి తెలంగాణ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించాలని, తిరుపతి నుంచి కరీంనగర్ బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతీరోజు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ఈ రైలును నిజామాబాదు వరకు పొడిగించాలని ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం కాజీపేట నుంచి దాదర్ ముంబయి 07195/96 వయా పెద్దపల్లి, మిగతా 6వ పేజీలో

● పెద్దపల్లి- ఇందూర్ మార్గం..

పెద్దపల్లి నుంచి ఇందూర్ (నిజామాబాదు) మార్గాన్ని డబుల్ మార్గంగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మార్గం గుండా కరీంనగర్-తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్-కాగజ్‌నగర్ వరకు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో అత్యంత లాభాలు తెచ్చే మార్గాల్లో ఈ మార్గం ఒకటి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా లో గ్రానైట్ పరిశ్రమలు విస్తరించడంతో గ్రానైట్‌తో పాటు మార్బుల్స్ ఇతరత్రా సరుకుల రవాణా అత్యధికంగా అవుతున్నాయి. ఈ మార్గంలో సరకు రవాణా రైళ్లు అధికంగా నడుస్తున్నాయి. ఈ లైన్‌ను డబుల్ లైన్‌గా విస్తరించడంతో పాటు ప్రయాణికుల రైళ్ల సంఖ్యకు అనుగుణంగా రైళ్లను పెంచాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే డ్రైపోర్టుకు నిధులు కేటాయించాలి..

యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో సుల్తానాబాద్ దగ్గర్లో వచ్చిన రైల్వే భూతల ఓడ రేవు (రైల్వే డ్రైపోర్టు)కి నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పెద్దపల్లి జంక్షన్‌కి దగ్గర్లో నిర్మాణమవుతున్న బైపాస్ రైల్వే మార్గాన్నీ త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి, ప్రస్తుతం ఇక్కడ కేవలం సింగిల్ రైల్వే బైపాస్ మార్గం నిర్మిస్తున్నారు. అలాగాకుండా రెండు లైన్‌ల బైపాస్‌తో పాటు రైల్వే స్టేషన్ నిర్మిస్తే ఇది పెద్దపల్లి జంక్షన్‌కి ప్రత్యామ్నాయ రైల్వే స్టేషన్‌గా మారి నిజామాబాదు నుంచి వరంగల్‌కి నేరుగా అనుసంధానం ఏర్పడి సమయం ఆదా అవుతుంది.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

రామగిరి ఎస్‌ఐ చంద్రకుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో గంజాయి నియంత్ర ణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: గ్రామాల్లో పె రిగిపో తున్న గంజాయి నియంత్రకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని యువకులు వ్యసనాలకు బానిసలు కాకుండా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పారిశ్రామిక ప్రాంతంలో పోకిరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్‌ఐ: పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, ఆటో స్టాండ్‌ల వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. వేధింపులకు గురైయ్యే విద్యార్థినులు, మహిళలు డయల్ 100కు కాల్‌చేసినా, నేరుగా తమకు సమాచారం అందించినా తక్షణం చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డుప్రమాదాలకు నివార ణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: రోడ్డు ప్రమాదాలు జరగకుండా మండలంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతీ నిత్యం డ్రండెన్ డ్రైవ్ పరీక్షలను చేస్తున్నాం. పారిశ్రామిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి బారికేడ్లను ఏర్పాటు చేశాం. పటిష్ట చర్యలతో ప్రమాదాల రేటు తగ్గింది.

- రామగిరి

రామగుండంలో బెంబేలెత్తిస్తున్న దొంగలు

- ఇంటి తాళం పగులగొట్టి చోరీలు
- వరుస ఘటనల్లో భారీగా నగదు అపహరణ

6

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- సీఎంను కోరిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. రామగుండం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, రామగుండంలో నూతనంగా నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ పనులను త్వరలో ప్రారంభించే విధంగా చొరవ చూపాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉంటానని, త్వరలోనే విద్యుత్ ప్లాంట్ పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రిని మక్కాన్‌సింగ్ ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



సుద్దాలలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్, రేగడి మద్దికుంట, సుద్దాల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పూర్తయిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్లు నిర్మించేందుకు గాను శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

సుల్తానాబాద్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): రాబోయే పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, శనివారం నుంచి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల జిల్లా పరిషత్ హైస్కూల్, సుద్దాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలను డీఈవో శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్సు రిజిష్టర్లను, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాధవి మాట్లాడుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. శనివారం నుంచి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను రెగ్యులర్ గా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సాయంత్రం వేళ స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. డీఈవో వెంట మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య తదితరులు ఉన్నారు.

పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జెట్టి రాధ పదవీ విరమణ పొందిన సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం సన్మానించారు. ఓదెల మండలం ఇందుర్తి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిగా జెట్టి రాధ విధులు నిర్వహిస్తున్నారు. ఆమె శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఉపాధ్యాయురాలిగా ఆమె విశిష్ట సేవలను అందించారు. ఆమెను కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కొనియాడారు. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే సత్తా ఉపాధ్యాయులకే ఉంటుంద న్నారు. అంకితభావంతో విద్యాబోధన చేస్తే ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో డీఈవో మాధవి పాల్గొన్నారు.

ఎడారిని తలపిస్తున్న హుస్సేన్‌మియావాగు

- తీవ్ర ఆందోళనలో రైతులు
- ఎస్సారెస్పీ నీటిపైనే ఆశలు
- సాగునీరు అందించి ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు



వెలవెలబోతున్న హుస్సేన్‌మియావాగు (ఫైల్)

జూలపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆయా గ్రామాల గుండా ప్రవహిస్తున్న హుస్సేన్‌మియా వాగులో జనవరి నెలలోనే నీటి నిల్వలు గణనీయంగా తగ్గి ఎడారిని తలపిస్తోంది. దీంతో మండలంలోని వాగు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతాల్లో వరిసాగు ముమ్మరంగా సాగుతోంది. ఆదిలోనే హుస్సేన్‌మియా వాగులో నీరులేక సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. హుస్సేన్‌మియా వాగు ఆయకట్టు ప్రాంతంలో సాగుచేస్తున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మండల రైతులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ సాగునీటిని పెద్దాపూర్ పెద్దచెరువు ద్వారా హుస్సేన్ మియావాగులోకి వదిలి ఆయకట్టుపై ఆధారపడిన రైతులకు సాగునీటిని అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామశివారులో గల పెద్దచెరువు మత్తడి కింద జీవం పోసుకున్న హుస్సేన్‌మియావాగు ఇక్కడి నుంచి అబ్బాపూర్, జూలపల్లి, కోనరావుపేట, వడుకాపూర్ గ్రామాల శివారు గుండా ప్రవహిస్తూ వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగు నీటిని అందిస్తోంది. ఎంతో మంది రైతుల పాలిట జీవ నదిగా విలసిల్లుతున్న హుస్సేన్‌మియావాగులో నీరు అడుగంటుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ నీటితో పెద్దాపూర్ పెద్దచెరువును నింపి దాని ద్వారా హుస్సేన్‌మియావాగులో సాగు నీటిని వదిలి ఆయకట్టు ప్రాంత రైతులను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ నీటితో పంటలను కాపాడాలి

వేల్పుల ఓదెలు రైతు, వడుకాపూర్



గతంలో ఎన్నడూ లేనంతగా హుస్సేన్‌మియా వాగులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఆయకట్టు ప్రాంతంలో వేసుకున్న పంటలు పండుతాయో ఎండుతాయో అనే ఆందోళన ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్సారెస్పీ నీటిని హుస్సేన్ మియావాగులోకి వదిలి పంటలను కాపాడాలి.

పెద్దచెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలి

గుడిపాటి సంతోష్‌రెడ్డి, బీజేపీ నాయకుడు జూలపల్లి



హుస్సేన్‌మియా వాగు పరివాహక ప్రాంతంలోని ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, అధికారులు స్పందించి రేవెల్లి గ్రామం వద్ద డీ-83 కాలువ నుంచి ఎస్కేప్ ద్వారా పెద్దాపూర్ పెద్దచెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలి. దాని ద్వారా హుస్సేన్ మియావాగు ఆయకట్టుకు సాగునీరు అందించి పంటలు కాపాడాలి.

సుల్తానాబాద్

మున్సిపల్ కమిషనర్‌గా నియాజ్



సుల్తానాబాద్, జనవరి 31: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మహ్మద్ నియాజ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ తోట వెంకటేశ్ సుల్తానాబాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ నియాజ్‌ను సుల్తానాబాద్ కమిషనర్‌గా నియమించారు. ఈమేరకు శుక్రవారం నియాజ్ బాధ్యతలు చేపట్టారు. మేనేజర్ అలీ మొద్దీన్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రామగుండం డిప్యూటీ కమిషనర్‌గా నాయిని వెంకటస్వామి



కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా నాయిని వెంకటస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డోర్నకల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను రామగుండం డీసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజా భద్రతలో రాజీ పడం: సీపీ



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వప్న రాణి

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా భద్రతలో రాజీ పడమని, రోడ్డు భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో హెల్మెట్ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి నందన గార్డెన్ వరకు హెల్మెట్ అవగాహన ర్యాలీని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, సబ్ జడ్జి స్వప్నరాణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నందన గార్డెన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో సీపీ మాట్లాడుతూ హెల్మెట్ ర్యాలీ నిర్వహించే సమయంలో చాలా మంది వాహనదారులు, కుటుంబసభ్యులతో పరిమితికి మించి వెళ్తున్నారని అన్నారు. రోడ్డు భద్రతలో వాహనదారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వారితోపాటు ఇతరులకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువ ఉందని అటువంటి వారిపై ఉదాసీనంగా వ్యవహరించవద్దని, కఠినవైఖరితో ఉండాలని పోలీసులను ఆదేశించారు. చట్టాన్ని గౌరవించి నియమాలు పాటించినవారికే సహకారం అందించాలని సూచించారు. హెల్మెట్ తప్పకుండా వాడాలని, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత పాటించకుండా, ర్యాష్ డ్రైవింగ్, ట్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎటువంటి ప్రమాదాలు లేకుండా వాహనాలు నడిపిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కేశోరం సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహాయంతో మున్సిపల్ కార్మికులకు, పాత్రికేయులకు హెల్మెట్ లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ పెద్దపల్లి చేతన, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ సబ్ జడ్జి స్వప్నరాణి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ జానీ నర్సింహులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సీఐ ప్రవీణ్ కుమార్, జిల్లా రవాణా అధికారి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్టీసీ డ్రైవర్ తిరుపతికి సన్మానం

కళ్యాణ్‌నగర్: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ తిరుపతిని జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. తిరుపతి గోదావరిఖని ఆర్టీసీ డిపోలో 30 సంవత్సరాలుగా పనిచేస్తూ ఎలాంటి ప్రమాదాలు లేకుండా బస్సు నడిపినందుకు సీపీ అభినందించారు. కార్యక్రమంలో ఖని డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్ ఇంజనీర్ సంధ్యారాణి, ట్రాఫిక్ ఇన్‌చార్జి లింగయ్య, అమృత, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు ఇన్‌చార్జి రాజిరెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందేలా చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష - ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ సేవలు జిల్లాలోని ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి కలెక్టర్ శ్రీహర్ష బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిసెంబరు 31 నాటికి క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 102 శాతం ఉందని, జిల్లాలో ప్రతీ బ్యాంకు డిపాజిట్లను పెంచేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లాలోని రైతులకు పంట రుణాల కింద 1,864 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, డిసెంబరు చివరి నాటికి 1037 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఎంఎస్ఎంఈలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,164 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా, రూ. 650 కోట్ల రుణాలు ప్రతీ బ్యాంకు బ్రాంచీ నుంచి కనీసం ఐదు వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన యువతకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 27 నాటికి 4,559 స్వశక్తి సంఘాలకు 386 కోట్ల 99 లక్షలు, మెప్మా కింద 411 సంఘాలకు 49 కోట్ల34లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. స్వశక్తి సంఘాలకు నిర్దేశించుకున్న లక్ష్యంలో 80 శాతం మాత్రమే పూర్తి కావడానికి గల కారణాలను కలెక్టర్ ఆరాతీశారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల కింద యువతకు రుణాలు అందించాలని, స్టాండ్ అప్ ఇండియా కింద డిసెంబరు చివరి నాటికి 20 యూనిట్లకు 3 కోట్ల 62 లక్షల, ముద్రా రుణాల కింద 20 వేల 417 మంది లబ్ధిదారులకు 156 కోట్ల 94 లక్షల రుణాలు అందించామని తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద ప్రస్తుత సంవత్సరంలో మూడు కోట్ల 32 లక్షల విలువగల 64 యూనిట్లను గ్రౌండ్ చేశామన్నారు.

పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో 45 మంది అర్హులకు 91 లక్షల రుణం పంపిణీ చేశామని, మత్స్య శాఖ ద్వారా 81 మందికి 2 కోట్ల 54 లక్షల రుణ పంపిణీ జరిగిందని అన్నారు. అనంతరం కలెక్టర్ 2025-26 సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికను ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

గాయపడిన వృద్ధురాలు మృతి


పద్మ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 19న వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు బొమ్మకంటి పద్మ(76) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గ్రామంలోని తనఇంటిలో పద్మ ఒంటరిగా నివసిస్తోంది. వంటచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర అంటుకుంది. మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలు వేయడం వల్ల చుట్టుపక్కల వారు గమనించి కాపాడారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న కుమారులు, బంధువులు పద్మను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బైక్‌పై నుంచి పడి మహిళ..


భారతి (ఫైల్)

చొప్పదండి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణశివారులో బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పసుపునుటి భారతి(60) నగునూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి బైక్‌పై వెళ్తోంది. బైక్‌ను కుమారుడు చంద్రశేఖర్ నడుపుతుండగా నవోదయ శివారులో మేకపిల్ల అడ్డువచ్చింది. చంద్రశేఖర్ తన బైక్‌ను అకస్మాత్తుగా నిలిపివేయగా వెనుకాల కూర్చున్న భారతి కిందపడింది. ఈప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే ఆమెను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భారతి కుమారుడు పుసుపునూటి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


మల్లేష్ (ఫైల్)

వేములవాడ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి దేశం వెళ్లిన వ్యక్తి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మల్లేష్ (40) 18 నెలల క్రితం దుబాయి దేశం వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబర్ 24వ తేదీన కూలిపని చేస్తుండగా ఇసుకదిబ్బ కూలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతోమృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రమీల, కూతురులు కీర్తన, సాత్వికప్రియతో పాటు కుమారుడు ఉన్నాడు. మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గోసిక అంజయ్య (29) అనే యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య మద్యానికి బానిసై రోజూ ఇంట్లో గొడవచేసేవాడు. అదే క్రమంలో ఈనెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు కరీంనగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అంజయ్య సోదరుడు గోసిక శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సనత్‌కుమార్ తెలిపారు.

పట్టించుకునే వారు లేక..

- తప్పని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- వారసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు
- హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 46 ఫిర్యాదులు


హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవితం చరమాంకంలో ఉన్న వృద్ధులను వారి పిల్లలు పట్టించుకోకపోవడంతో వారు అధికారులను ఆశ్రయిస్తున్నారు. బాల్యంలో తమ బాగోగులను చూసి భవిష్యత్తును బంగారు మయం చేసి భరోసా కల్పించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులపై చేయి చేసుకొని సభ్య సమాజం తల దించుకునేలా వ్యవహరిస్తున్నారు. వీటన్నిటికి విరుగుడు చూపిస్తూ 2005లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టు తీసుకువచ్చింది. వృద్ధ తల్లి దండ్రులపై కఠినంగా వ్యవహరించే వారసులకు హెచ్చరికలు జారీ చేసింది.

తల్లిదండ్రులపై పెరుగుతున్న దాడులు

నేటి సమాజంలో రోజు రోజుకు వృద్ధ తల్లిదండ్రులపై దాడులు పెరిగిపోతున్నాయి. కళ్ల ముందే కొన్ని సంఘటనలు జరుగుతుంటే మాకేందుకులే అని సమాజం పట్టించుకోవడం లేదు. వృద్ధ తల్లిదండ్రుల స్థిర, చిరాస్థులను తమ పేర్లపై మార్చుకుని వారిని పట్టించుకోవడం లేదు. పైగా దాడులు చేస్తున్నారు. 2005లో సీనియర్ సిటిజన్ యాక్టు వచ్చినా దాని గురించి పెద్దగా ప్రచారం లేదు. ఇటీవల సీనియర్ సిటిజన్ యాక్టుపై విస్తృత ప్రచారం జరుగుతుంది. వృద్ధ తల్లిదండ్రులను పోషించకపోయినా, వారిపైన దాడులు చేసినా చట్టం అటువంటి వారిని శిక్షిస్తుంది. సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల పట్టాలు చేసుకున్న తర్వాత వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకపోతే ఆ పట్టాను


హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం

రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకే ఆ భూములు చెందేలా చేయవచ్చు ఉద్యోగాలు చేసే పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేతనం నుంచి 10వేల రూపాయలు ఇచ్చే వెసులుబాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి వస్తాయి.

కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలుసుకున్న 46 మంది వృద్ధులు ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయగానే అధికారులు వారి వారసులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వినని వారిని స్థిరాస్తులు మార్పులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు వచ్చిన 46 ఫిర్యాదుల్లో 33 పరిష్కారమయ్యాయి. 13 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ బాబు తెలిపారు. ఉద్యోగులు కూడా తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

భార్యను హత్యచేసిన కేసులో జీవిత ఖైదు

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన కోల తిరుపతికి భార్యను చంపిన కేసులో గోదావరిఖనిజిల్లా ఆరో సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు జీవితఖైదు విధించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలపల్లి గ్రామానికి చెందిన కోల స్వరూపను ఆమె భర్త కోల తిరుపతి 2020నవంబర్ ఆరవతేదీన గొంతునులిమి హత్య చేశాడు. ఈ మేరకు మృతురాలు స్వరూప తమ్ముడు కన్నం రాజేందర్ ఫిర్యాదు మేరకు అప్పటి కమాన్‌పూర్ ఎస్సై పి శ్యామ్‌పటేల్ కేసు నమోదుచేశారు. అప్పటి గోదావరిఖని 2వపట్టణ సీఐ కె లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి నివేదికను కోర్టులో సమర్పించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ టి జ్యోతిరెడ్డి సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ అనంతరం గోదావరిఖని సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాసరావు నిందుతునికి జీవితఖైదుతో పాటు, 1000రూపాయలు జరిమానా విధించారు.

రైలునుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓదెల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓదెల రైల్వేస్టేషన్‌లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గోరఖ్‌పూర్ నుంచి తిరువనంతపురం కొచ్చి వైపువెళ్లే రైలు బోగీలో ఉన్నవ్యక్తి రైలునడుస్తున్న సమయంలో మరోబోగీ ఎక్కే ప్రయత్నంలో రైలు ప్లాట్‌ఫాం మధ్య పడి మృతిచెందాడు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు . అతని వద్ద సెల్ ఫోన్ లభించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

వనం వీడి.. జనంలోకి నెమలి


గంభీరావుపేటలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వనం వీడి ఓ వణ్యప్రాణి జనంలోకి వచ్చింది. అడవుల్లో పంట పొలాల్లో సంచరించే నెమలి ఊళ్లోకి వచ్చింది. గంభీరావుపేట గాంధీ చౌక్ నుంచి లింగన్నపేట వెళ్లే ప్రధాన రహదారిలో అనూహ్యంగా నెమలి ప్రత్యక్షమైంది. దీంతో వనంలో ఉండాల్సిన వణ్యప్రాణి జనంలోకి రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొన్ని గంటల పాటు నెమలి ప్రధాన రహదారిలో తిరగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 15 మంది ప్రయాణికులకు గాయాలు


గోరంటాల వద్ద అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద ఏపీ 29జెడ్ 1742నంబర్ గల కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 15మందిప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. కామారెడ్డినుంచి 52మంది ప్రయాణికులతో కరీంనగర్ వెళుతున్న ఆర్టీసీబస్సు గొరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పంటపొలాల్లో ఉన్న రైతులు, గ్రామయువకులు, నాయకులు ప్రమాదస్థలానికి చేరుకుని బస్సులోంచి ప్రయాణికులను కిందకుదించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరళించారు. కామారెడ్డి ఆసుపత్రికిలో ఐదుగురు, సిరిసిల్లఆసుపత్రిలో 10మంది ప్రయాణికులు చికిత్సపొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదనితేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో కామారెడ్డి, తాడ్వాయి, రెడ్డిపేట, మాచారెడ్డి మండలాలకు చెందినవారు ఉన్నట్టుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరిగిందా లేక వాహన వేగంలో స్టీరింగ్‌కు లాక్‌పడి ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది.

సీఐ అరాచకాలపై న్యాయపరమైన విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాదితులు

జమ్మికుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణసీఐ వరంగంటి రవికుమార్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపించాలని బాధితులు షేక్ సాబీర్‌అలీ, అంబాల రాజు, కాటిపల్లి లక్ష్మి, కాటిపల్లి సంధ్యారాణి, ఠాగూర్ సుశీల అన్నారు. శుక్రవారం జమ్మికుంటలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులను కూడా సీఐ వేధిండన్నారు. జమ్మికుంటలో పనిచేయనివ్వకుండా ఇతరప్రాంతాలకు పంపిస్తున్నాడని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లో ఒక ప్రైవేట్ వ్యక్తి సీఐ గన్‌మెన్‌గా చలామణి అవుతున్నాడన్నారు. అతడికి తోడు హోంగార్డు యాకూబ్ కూడా ఉన్నాడన్నారు. వీరిద్దరూ ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తారని, డబ్బులు ఇవ్వని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ అన్ని విషయాల్లో సీఐని ఏసీపీ శ్రీనివాస్ జీ కాపాడుతున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వారిద్దరిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిఏడల ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు

- మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


బూస కార్తీక్ (ఫైల్)

శంకరపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీకి అలవాటుపడ్డాడు. లక్షలు సంపాదించవచ్చని భ్రమపడ్డాడు. ఉన్న డబ్బులు పోగొట్టుకుని చివరి ఆత్మహత్యాయ్నం చేసుకోగా శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటుపడ్డాడు. దీంతో చేసిన అప్పులకు గతంలోనే తల్లిదండ్రులు అర ఎకరం భూమి అమ్మి ఆ అప్పు తీర్చారు. అయినప్పటికీ కార్తీక్‌లో మార్పు రాలేదు. మళ్లీరమ్మీ ఆటకోసం రూ.2లక్షల వరకు తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేసినట్లు సమాచారం. ఆ డబ్బులు కూడా ఆటలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు విషయం తెలపలేక అప్పు తీర్చే దారిలేక మనస్థాపంతో ఈనెల28న గద్దపాక శివారులోని వాగువద్ద క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా స్నేహితుడు జక్కుల రాజ్‌కుమార్‌కు తెలిపాడు. రాజ్‌కుమార్ కార్తీక్ తండ్రికి శంకర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తీక్‌ను జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల30న రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న విద్యుత్ బోరు మోటారు తీగను అపహరించుకుపోయిన సంఘటనలో గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన శివరాత్రి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామ శివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం సమీపంలోని విద్యుత్ బోరు మోటారుతీగను ఈనెల8న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ దీటి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలకేంద్రంలోని రెండవబైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు శ్రీనివాస్ కరెంటు తీగతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయం వద్ద ఉన్న బోరు మోటారు తీగను దొంగిలించానని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ.8 వేల విలువైన విద్యుత్ తీగను స్వాధీనపర్చుకుని శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రెస్టారెంట్‌లో కార్పొరేషన్ సిబ్బంది తనిఖీలు

కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్టు మున్సిపల్ కార్పొరేషన్ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటేషన్ సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, ప్రశాంత్ తనిఖీల్లో పాల్గొన్నారు. రెస్టారెంట్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించనందున రూ.10వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

గజసింగవరంలో దొంగల బీభత్సం..

- రెండిళ్లలో చోరీ
- రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి దొంగలు చొరబడి నగదుతోపాటు, బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. బాల్‌నర్సు శ్రీకాంత్, బాయిని బాలయ్య ఇళ్ల తాళాలను పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. శ్రీకాంత్ తల్లి అనారోగ్యంతో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శ్రీకాంత్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళంవేసి ఆసుపత్రిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లి, గురువారంరాత్రి అక్కడేఉన్నారు. దీంతో శ్రీకాంత్ ఇంటికివేసిన తాళాలను పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలోఉన్న 60వేలనగదు, 2తులాల వెండి, నాలుగు పట్టగొలుసుల జతలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాయిని బాలయ్య అదే గ్రామంలో కొత్త ఇల్లునిర్మించుకుని పాతఇంటికి తాళం వేశాడు. పాతఇల్లు తాళం పగులగొట్టి దొంగలు చొరబడ్డారు. అయితే ఆ ఇంట్లో ఏమి లేకపోవడంతో నష్టం జరగలేదు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా పరిసరాలను పరిశీలించి వెళ్లారు.

ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో భారీ చోరీ

- తాళం పగులగొట్టి రూ.15లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

కోల్‌సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఇనగంటి రాంమోహన్‌రావు అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అతడిభార్య క్యాన్సర్ చికిత్స నిమిత్తం ఇంటికి తాళంవేసి ఈనెల26న రాంమోహన్‌రావు తన కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు ఇంట్లోని కబోర్డ్‌లో ఉన్న రూ.15.2లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెండురోజుల క్రితం చోరీజరిగినట్టు తెలుస్తోంది. భార్య చికిత్సనిమిత్తం ఇటీవలే గోదావరిఖనిలోని తనప్లాట్ అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో పెట్టానని, అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

బెడ్‌రూమ్ తాళం చెవి ఉండడంతో..

ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు బెడ్‌రూమ్ తాళంతీసి లోనికి వెళ్లారు. బెడ్‌రూమ్ తాళంచేయి అందుబాటులో ఉండడంతో వారికి తాళం పగులగొట్టకుండానే లోనికివెళ్లడం సులు వైంది. ఇతర అభరణాలు కానీ, వస్తువులుకానీ ఎత్తుకెళ్లలేదు.భారీస్థాయిలో నగదు దొరకడంతో దానితో ఉడాయించారు. ఎన్టీపీసీ పోలీసులు, కమి షనరేట్ సీసీఎస్, క్లూస్ టీమ్‌లు ఘటనస్థలంలో పరిశీలించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

- కేసు నమోదు


స్రవంతి, శ్రీమోక్ష(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని బిట్ల స్రవంతి, ఆమె ఐదేళ్లకూతురు శ్రీమోక్షలు అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని బిట్ల మల్లేశంభార్య స్రవంతి తన కూతురు శ్రీమోక్షను తీసుకుని ఈనెల 28న చందుర్తిలోని తన తల్లిగారింటికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి బయలుదేరారని పేర్కొన్నారు. భార్య, కూతురు చేరుకున్నారో..? లేదోనని అత్తగారింటికి ఫోను చేసిన మల్లేశంకు అక్కడకు రాలేదని తెలిసిందన్నారు. చుట్టుపక్కల, బంధువులవద్దఆరాతీసినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాధితుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

న్యాయవాది పేరుతో ఘరానా మోసం

- రూ.1.30 కోట్లు వసూలు.. యువకుడి అరెస్ట్


ఫణిధర్

సిరిసిల్ల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి దాదాపు కోటి 30లక్షల రూపాయలు వసూలు చేశాడు. వచ్చినడబ్బుతో జల్సాలు చేశాడు. బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణీధర్ అనే నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కే కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణీదర్ అనేవ్యక్తి తన సంపాదన సరిపోక శ్రమ లేకుండా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించాలనుకున్నాడు.

గతంలో స్థానికంగా ఓ న్యాయవాది వద్ద క్లర్క్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో భూ, సివిల్ తగాదాలు, లోన్ సమస్యలు, భార్యభర్తల గొడవలు.. ఇలా కోర్టుకు సంబంధించిన సమస్యలపై ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. న్యాయవాది అవతారమెత్తి కోర్టుల్లో కేసులు ఫైల్ చేయడానికి వచ్చే బాధితులతో పరిచయాలు చేసుకుంటూ, తనే న్యాయవాదినని నమ్మించాడు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ ప్రైవేట్ స్కూల్ యజమాని కొంటికర్ల వారణాసి కాలిమాతకు సంబం ధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో భూసమస్యను పరిష్కరిస్తానని నమ్మించి 25లక్షల రూపాయలు తీసుకొన్నాడు. సంజీవయ్య నగర్‌కు చెందిన దరిపల్లి సురేష్, అతడి సోదరుడు రమేష్‌లపై ఉన్న చెక్‌బౌన్స్ కేసులతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరిస్తా నని నమ్మించి, పలు దపాలుగా మొత్తం రూ.91,52,250 తీసుకున్నాడు. తాజాగా పెద్దూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్‌లకు చెందిన విజయలక్ష్మిని నమ్మించి రూ.1.90 లక్షలు తీసుకొన్నాడు. అదేవిధంగా చంద్రంపేటకు చెందిన యెల్ల లలిత భూసమస్య పరిష్కరిస్తానని నమ్మించి ఆమె వద్ద రూ.11.60 లక్షలు వసూలు చేశాడు.

అయితే ఫణిధర్ చేతిలో మోసపోయామని తెలుసుకున్న బాధితులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీబాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వికటించి శుక్రవారం ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం జుహా, శ్రావ్య, హుమేరియా, నందిని, కీర్తిమణి అనే ఐదుగురు విద్యార్థులకు కడుపు నొప్పి వచ్చి వాంతులు చేసుకున్నారు. వెంటనే కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి చికిత్సకోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బియ్యం సరిగా ఉడుకకపోవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సమాచారం అందుకుని హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్సపొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రి డాక్టర్ రాముతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి పంపించారు. అనంతరం విప్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ పరామర్శించారు అస్వస్థతకు గురైన విద్యార్థులు నాగులపేట, రేచపల్లి, తాళ్లపేట, బురుదేశిపల్లె, గోవింద్‌పల్లెకు చెందిన వారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి తెలిపారు.

మహాకుంభ మేళాకు ఆరు ప్రత్యేక రైళ్లు..



- ఫిబ్రవరి 14, 18, 22 తేదీల్లో నడపనున్న దక్షిణమధ్య రైల్వే

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు మరో ఆరు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపను న్నట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. రైలు నంబర్ 07111 ఫిబ్రవరి 14న ఉదయం 11:10 గంటలకు బీదర్ నుంచి దానాపూర్‌కు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23.55 గంటలకు చేరుకోనున్నది. ఈ రైలు రాష్ట్రంలో జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాదు, చర్లపల్లి, జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్‌పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నది. ఇదే రైలు నంబర్ 07112 ఫిబ్రవరి 16న ఉదయం దానాపూర్‌నుంచి 15:15 గంటలకు బయలుదేరి, రెండో రోజు 23:45 గంటలకు చర్లపల్లి (హైదరా బాద్) స్టేషన్‌కు చేరుకోనున్నది. రైలు నంబర్ 07077 ఫిబ్రవరి 18, 22 తేదీల్లో మధ్యాహ్నం 15:00 చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి దానాపూర్ చేరుకోనున్నది. అలాగే రైలు నంబర్ 07078 ఫిబ్రవరి 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 15:00 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:45 గంట లకు చర్లపల్లి చేరుకోనున్నది. ఈ రైళ్లు రాష్ట్రంలోని జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ఆగుతాయి.

జమ్మికుంటలో రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 310క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 32క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

- **పెద్దపల్లి లో రూ.7022**

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేయగా, శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన పత్తికి అత్యధికంగా 7,022 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా ఐదు వేల రూపాయలు, మోడల్ ధర 6,681 రూపాయలు పలికింది. అత్యధిక మంది రైతులకు 6,500 నుంచి ఏడు వేల రూపాయల మధ్య ధర పెట్టారు. మార్కెట్‌కు 1,199 బస్తాల్లో 1318.9 క్వింటాళ్ల పత్తిని 330 మంది తీసుకువచ్చారు. ఈ-నామ్ ద్వారానే పత్తిని ట్రేడర్లు పరిశీలించి ధరలు ఖరారు చేశారు. గురువారం అత్యధిక మంది రైతులకు క్వింటాలుకు 6,500 రూపాయలకు మించకుండా చెల్లించారు. 52 బస్తాలకే 7,001 నుంచి 7,031 ధర చెల్లించారు. అత్యధికంగా 6,500 నుంచి 7,000 చెల్లించారు.





కిందపడి గాయపడిన యాదాద్రి క్రీడాకారిణి సంగీత

కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న రాచకొండ, హైదరాబాద్ సిటీ పోలీస్ జట్లు

ఉత్సాహంగా.. పోలీస్ క్రీడలు

- పోటాపోటీగా నాల్గవ రోజు ఆటలు
- నేడు ముగింపు సమావేశం
- హాజరు కానున్న డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడవ తెలం గాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ముగింపు దశకు చేరా యి. నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంతో పాటు 12 ప్రదేశాల్లో నిర్వహిం చిన 28 క్రీడలు చివరి దశకు చేరాయి. 20 పోలీస్ జోన్ల నుంచి 2400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల నాల్గవ రోజు శుక్రవారం వివిధ క్రీడాంశాల్లో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యా చ్‌లను నిర్వహించారు. క్రీడా కారులు పోటాపోటీగా తమ క్రీడా ప్రతిభను చాటి విజేత లుగా నిలిచేందుకు కృషి చేశారు. వివిధ పోటీలను ఐజీపీ స్పోర్ట్స్ ఎస్ రమేష్ రెడ్డితోపాటు మరో ఐజీపీ ఎం చంద్రశేఖర్ ఎడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, ఏసీపీ విజయ్ కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రారంభించారు.

- **పోటీల ఫలితాలు..**

ఖో-ఖో పోటీల్లో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, టీజీఎస్‌బి-2 ద్వితీయ స్థానం, రాజన్న జోన్-3 తృతీయ స్థానం సాధించాయి. కబడ్డీ మహిళల విభాగంలో రాచకొండ కమిషనరేట్ ప్రథమ స్థానం, యాదాద్రి జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, రాచకొండ ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో హైదరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, కాళేశ్వరం జోన్ ద్వితీయ స్థానాలు సాధించాయి. హాకీ క్రీడల్లో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, వరంగల్ జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. హ్యాండ్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, భద్రాద్రి జోన్ తృతీయ స్థానం సాధించాయి. అలాగే ఫుట్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, సైబరాబాద్ జోన్ తృతీయ స్థానం సాధించాయి. ఈ జట్లకు కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం రాత్రి పతకాలను ప్రదానం చేశారు.

- **నేడు పోటీల ముగింపు**

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల ముగింపు ఉత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ఈ ముగింపు సమావేశానికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కూడా అందించనున్నారు.

ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

- **ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి**

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఇక నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తానని ఐజీ స్పోర్ట్స్ తెలంగాణ రమేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలలో శుక్రవారం ఆయన ఖో-ఖో, హాకీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆయన అభినందిం చారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే సీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఖో-ఖో పోటీలను తిలకించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఐజీ రమేష్‌రెడ్డి

ఖో-ఖో క్రీడల్లో మంచి ప్రతిభచాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్‌ను ఐజీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారవు, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్ఐ నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న క్రీడాకారులు



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న సైబరాబాద్, హైదరాబాద్ క్రీడాకారులు

మట్టి నుంచి మ్యాట్‌పైకి..

- కబడ్డీకి పెరిగిన ఆదరణ
- ప్రో కబడ్డీతో కార్పొరేట్ స్థాయికి
- అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడగా ఉన్న కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్‌కు మారింది. పల్లెల్లో మట్టిరోడ్లపై ఆడిన ఆట మ్యాట్‌పైకి చేరింది. కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్ క్రీడ.. ప్రో కబడ్డీ నిర్వహణతో రెండు తెలుగు రాష్ట్రాల అధికారిక క్రీడ ఇప్పుడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు నిర్వహిస్తున్న సందర్భంగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు పంచుకున్నారు.

ప్రో కబడ్డీని టీవీల్లో 20 కోట్ల 20 లక్షల మంది ప్రేక్షకులు వీక్షించారు. ఇది ప్రపంచ చరిత్రలో అత్యధికం. ఏ క్రీడలో లేని విధంగా అత్యధికశాతం ఉద్యోగాలు కబడ్డీతో వస్తున్నాయని వారు తెలిపారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కబడ్డీ అకాడమీలు ఉండేవి. అప్పుడు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులు అకాడమీలో చేరి ఉన్నతమైన క్రీడాకారుడులుగా ఎదిగారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాకు ఒక కబడ్డీ క్రీడా అకాడమీ నెలకొల్పాలన్నారు. కబడ్డీ ఇప్పుడు ఇండోర్ క్రీడగా మారిందన్నారు. క్రీడా శిక్షణతో విద్యార్థులలో ఆరోగ్యం, చక్కని శారీరక అభివృద్ధి కలుగుతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని తెలపిపారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2017లో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించారన్నారు. ఇప్పుడు ఐసీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి కృషితో కరీంనగర్‌లో మూడవ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడలను నిర్వహిస్తే, ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



ఏ వేణుగోపాల్, ఎం మహేందర్ రెడ్డి

"పోలీసుశాఖలో ఉన్నతస్థాయిలో ఉన్న డీఎస్పీ ఏ వేణుగోపాల్ 2000 సంవత్సరంలో కొలంబోలో జరిగిన ఏషియన్ కబడ్డీ పోటీల్లో భారతజట్టు నుంచి పాల్గొని బంగారు పతకం సాధించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం మహేందర్‌రెడ్డి 2016 సంవత్సరంలో అస్సాంలో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు."

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫె సర్ డి.వరలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. బీఏలో 47.74 శాతం, బీకాంతో 70.25, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 48.46, బీ ఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60.94 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపారు. https://gdcwakarimnagar.com ఫలితాలు కళాశాల వెబ్సై ట్‌లో అందు బాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులు ఉదయం నుంచి రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్న భక్తులు శ్రీపార్వతి పర మేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం అన బంధ ఆలయాల్లో కుంకుమ పూజలు ర్వహించారు.

- **రాజన్న ఆలయంలో విభాగాల హక్కులకు టెండర్ నిర్వహణ**

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లోని హక్కులకు ఓపెన్‌స్లాబ్‌లో టెండర్ నిర్వహిం చారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికా రులు రెండు సంవత్సరాలకు టెండ ర్‌ను నిర్వహించగా, కొబ్బరికాయల విక్రయం లైసెన్స్ హక్కులను రూ.2 కోట్ల 20 లక్షల 55 వేల 555కు శివరాత్రి చందు దక్కించుకోగా, వెజిటేరియన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను వేములవాడకు చెందిన రమేష్ రూ.46 లక్షల 50 వేలకు, కరీంనగర్‌లోని ఆలయానికి చెందిన 26వ నంబర్ షాప్ రూ.3 లక్షల 60 వేలకు, రాజన్న ఆలయంలోని శ్రీస్వామి వారికి భక్తులు సమ ర్పించుకునే ఒడిబియ్యం టెండర్‌ను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ.కోటి 95లక్షల 55వేల 999కి దక్కించుకున్నట్లు ఆలయాధి కారులు వెల్లడించారు.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

ఎగువ మానేరులోకి మల్లన్నసాగర్ నీటి విడుదల

గంభీరావుపేట. జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు నీటి విడు దల చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత రైతుల ప్రయోజ నార్థం 0.5 టీఎంసీల నీటి విడుదలకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి విన్నవించారని హమీద్ తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి మానేరులోకి నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు సహక రించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వరకు మల్ల న్నసాగర్ నీరు ఎగువ మానేరులోకి చేరుతుండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం నెలకొంది.

వైకల్యాన్ని జయించి..

- కార్, బైక్ సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు..
- స్వయంఉపాధితో దివ్యాంగుల ముందడుగు..

రుద్రంగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన ఇద్దరు యువకులు పుట్టకతో వచ్చిన లోపాలను లెక్క చేయకుండా.. పట్టుదలతో వృత్తిలో రాణిన్నారు. మూగ, చెవిటివారైన ఆ ఇద్దరూ స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్నారు. మెరుగైన పనితనంతో తమ వద్దకు వచ్చిన కస్టమర్లను ఆకట్టుకుం టున్నారు.

మండల కేంద్రానికి చెందిన మెల్ల దేవలక్ష్మి-నర్సరెడ్డి దంపతుల రెండో కూమారుడు మెల్ల ప్రవీణ్ పుట్టుకతో చెవిటి, మూగ. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని చదువు మానేసి. రుద్రంగిలో బైక్ మెకానిక్ షాపులో రెండు సంవత్సరాల పాటు రిపేరింగ్ నేర్చుకున్నాడు. అనంతరం తెలిసిన వారి వద్ద కొంత రుణం తీసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఆర్థిక ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాకూడదని భావించిన ప్రవీణ్ మెరుగైన పనితీరుతో వాహనదారులకు ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు మిగులుతున్నాయని ప్రవీణ్ పేర్కొంటున్నాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిట్టపురం గణేష్ అనే యువకుడు సైతం పుట్టుకతో మూగ, చెవిటి. వాహనాల వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో కొంతకాలం పనిచేశాడు. ఏడాది క్రితం కొంత అప్పు చేసి ఇంటి వద్దనే రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. తనలోని లోపాన్ని చూసి కృంగి పోకుండా స్వంతంగా ఉపాధి పొందుతున్న గణేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.



కార్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న ప్రవీణ్



బైక్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న గణేష్

విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం

సుభాష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేగులపాటి పాపా రావు కాంప్లెక్స్ (పాత స్పెన్సర్స్ మాల్)లో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల సరుకులు ఒకేచోట దొర కడం ప్రజలకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. సూపర్ మార్కెట్ నిర్వాహకులు మాట్లా డుతూ సరసమైన ధరలకు అన్ని రకాల వస్తువులు అందజేస్తున్నా మని తెలిపారు. అన్నిరకాల సరు కు లు అందుబాటులో ఉంచా మని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలను సన్మానించారు. మాజీ ఎమ్మె ల్యే రేగులపాటి పాపారావు, మాజీ కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డి సూపర్‌మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్‌లో విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

జేఎన్టీయూ ప్రిన్సిపల్‌గా విష్ణువర్ధన్ బాధ్యతల స్వీకరణ

రామగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మంథని కళాశాల ప్రిన్సిపల్‌గా విష్ణువర్ధన్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన చెరుకు శ్రీధర్‌రెడ్డి కొండగట్టు జేఎన్టీయూకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జేఎన్టీయూ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి బదిలీ పైవచ్చిన విష్ణువర్ధన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా మంథని సురేష్

మంథని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా మంథనికి చెందిన మంథని సురేష్ నియామకం అయ్యారు. నియామక పత్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మంథని సురేష్ హైదరాబాద్‌లో శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. చాలాకాలంగా పార్టీలో పని చేసినందుకు మంత్రి శ్రీధర్‌బాబు గుర్తించడంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తనకు ఆర్టీఏ మెంబర్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమం లో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నేతలు పేరవేన లింగయ్య యాదవ్, నర్సింగ రావు, కుడుదుల వెంకన్న, ఎరుకల ప్రవీణ్, అరెల్లి కిరణ్‌గౌడ్, మంథని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో బెంబేలెత్తిస్తున్న దొంగలు

- ఇంటి తాళం పగులగొట్టి చోరీలు
- వరుస చోరీల్లో భారీగా నగదు అపహరణ
- పాత నేరస్థుల పనిగా అనుమానాలు

కోల్‌సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దొంగలు బెంబేలెత్తిస్తున్నారు. ఇంటికి తాళం వేసి ఉందంటే చాలు తాళం పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్లను గుల్ల చేస్తున్నారు. వారం రోజుల్లో గోదావరిఖని, ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో వరుస చోరీల్లో రూ.18.7 లక్షల నగదు అపహరణకు గురైంది. సీసీ కెమెరాలకు చిక్కకుండా, వేలిముద్రల ఆనవాళ్లు లేకుండా నిందితులు ఈ చోరీలకు పాల్పడు తున్నారు. సంక్రాంతి పండుగకు ముందు, తరువాత వరుసగా ఘటనలు చోటు చేసుకుంటున్నా యి. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ, జ్యోతినగర్, ఎఫ్‌సీఐ గౌత మినగర్, గోదావరిఖని మార్కండేయకాలనీల్లోని భవ నాల్లో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి.

● కబోర్డులతో సులువవుతున్న దొంగతనాలు..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అభివృద్ధి చెందిన కాలనీలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. చోరీలు జరిగిన ఇండ్లలో ఇంటి యజమానులు కబోర్డులలో నగదు, ఆభరణాలు పెట్టిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయి. కబోర్డుల్లో దాయడంతో సులువుగా దొంగతనానికి అవకాశం ఉన్నట్టు పోలీసులు పేర్కొంటున్నారు.


కబోర్డు తెరిచిన దొంగలు(ఫైల్)

● పాత నేరస్థులపైనే అనుమానాలు..

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీలకు పాల్పడుతున్న ఘటనలపై దర్యాప్తు జరుపుతున్న పోలీసులు పాత నేరస్థుల పనిగానే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే తరహాలో గోదావరిఖని పట్టణంలో వరుస చోరీలు జరిగాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీలకు పాల్పడ్డారు. లక్షల రూపాయల నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో నిందితుడు దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. 70 చోరీలకు పాల్పడినట్టు పోలీస్‌ల విచారణలో తేలింది. రెండు కోట్ల రూపాయలకు పైగా నగదును ఎత్తుకెళ్లారు. ఈ సొమ్ము రికవరీ కూడా కాలేదు.

ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు

● ఎన్టీపీసీ కృష్ణనగర్‌లో నివాసముండే మహేష్ అనే పెట్రోల్ పంపు వ్యాపారి తన తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో నర్సంపేటకు వెళ్లగా తాళ పగులగొట్టి రూ.6లక్షల నగదు, భారీ స్థాయిలో బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

● గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంక్రాంతి సెలవులకు ఊరికి వెళ్లగా ఇంట్లోకి చొరబడిన దొంగలు నగదుతో పాటు మూడుతులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

● ఈ నెల 26న మార్కండేయకాలనీలో నివాసముండే గంగాధర రమేష్ అనే సింగరేణి ఉద్యోగి తన మామ మరణించడంతో కుటుంబం తో గోదావరిఖని తిలక్‌నగర్‌కు వెళ్లారు. తెల్లవారు వచ్చే సరికి ఇంటివెనుక తాళం పగులగొట్టి ఇంట్లోని కబోర్డ్‌లో రూ.3.5లక్షల నగదు ఎత్తుకెళ్లారు.

● ఈ నెల 26న ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో నివాసముండే ఎనగండి రాంమోహన్‌రావు భార్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు రూ.15.2లక్షల నగదును ఎత్తుకెళ్లారు.

● గోదావరిఖని టుటౌన్ పరిధిలోని సుందిళ్ల గడ్డంపల్లిలో గడ్డం రాజయ్య అనే వ్యక్తి చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లగా ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లోని రూ.50వేల నగదు, 90 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

వరాల జల్లు కురిసేనా ?

(3వ పేజీ తరువాయి)

నిజామాబాదు మార్గంలో నడుస్తున్న వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును రెగ్యులర్ రైలుగా మార్చి వారానికి కనీసం మూడు రోజులు నడపాలనే డిమాండ్ ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడల నుంచి ముంబయికి వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ఏడాదిన్నర కాలంగా తరచూ రద్దవుతున్న 17035/36 బల్లార్షా-కాజీపేట, బల్లార్షా-కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలును పునఃప్రారంభించి నూతన చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగిస్తే హైద రాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ రైలు కరోనాకి పూర్వం 57135/36 కాజీపేట-అజినీ (నాగపూర్) వరకు నడిచేది. మధ్యాహ్నం 1:30 గంటల తరువాత సాయంత్రం 5 గంటలకు ముందు కాజీపేట నుంచి బెల్లంపల్లి మార్గంలో ఒక పుష్‌పుల్ రైలు ప్రవేశపెట్టాలని దశాబ్దకాలంగా ప్రయాణికులు విజ్ఞప్తిచేస్తున్నా ఇప్పటివరకు పట్టించుకోవ డంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

● జాతీయ రహదారులకు నిధులు కేటాయించాలి..

జాతీయ రహదారులకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న 33 జిల్లా కేంద్రాల్లో కేవలం జాతీయ రహదారిలేని జిల్లా పెద్దపల్లి కావడం గమనార్హం. ప్రతిపాదిత జగిత్యాల, ధర్మారం, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కిష్టంపేట, టేకుమట్ల, రామప్ప ఆలయం వరకు ఉన్న మార్గాన్ని జాతీయ రహదారిగా విస్తరించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం మంథని నియో జకవర్గంలో జరుగుతున్న నాగపూర్ నుంచి విజయవాడ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలి. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్లే రాయపూర్ నుంచి హైదరాబాదు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, దీనివల్ల ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య అనుసంధానం మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని రామగిరి ఖిల్లా, మొలంగూరు ఖిల్లా, ఎలగందుల ఖిల్లాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు వేములవాడ, కొండగట్టు, ఓదెల, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చాలని, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, పెద్దపల్లి, మంథని, కాళేశ్వరం ఆలయాలను టూరిస్టు సర్క్యూట్‌లో చేర్చి ఈప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. బసంత్‌నగర్‌లో గల మినీ ఎయిర్‌పోర్టును విస్తరించే ప్రతిపాదనల్లో భాగంగా ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తే చుట్టు పక్కల జిల్లాల ప్రజలకు విమానయానం చేసే అదృష్టం వరించనుంది.

కుష్ఠువ్యాధిపై అవగాహన

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు నిస్సిక్రిష్టాన అన్నారు. మండలంలోని లాలపల్లి, బురహన్‌మియాపేట్ ఆరోగ్య కేంద్రాల్లో, ధూళికట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను ఎన్నుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు పొల్సాని సంపత్‌రావు, తంగెడ రాజేశ్వర్‌రావు, ఈర్ల శంకర్, ఒల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా నిషాంత్‌రావు

పెద్దపల్లి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం రాఘవపూర్ రైతువేదికలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవరనేని నిషాంత్‌రావు, ప్రధానకార్యదర్శిగా కల్లెపల్లి శ్రీలత, కోశాధికారిగా జనగామ శరత్‌బాబు, ఉపాధ్యక్షులుగా కలవేని శైలజ, సంయుక్త కార్యదర్శిగా తూముల రవిని ఎన్నుకున్నారు. సందర్భంగా పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్ కమిటీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల రక్షణ కోసం షీ టీం

సంక్షిప్త సమాచారం..

పెద్దపల్లి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం షీ టీం పనిచేస్తుందని షీ టీం ఇన్‌చార్జి లావణ్య అన్నారు. మండలంలోని పెద్దబొంకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యురాలు స్నేహలత, ప్రధానోపాధ్యాయులు సుదర్శనం పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం జనవరి 31 (ఆంధ్రజ్యోతి) మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. మండలం కేంద్రానికి ప్రముఖ వ్యాపారవేత్త జిడిగె కిషన్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, ధర్మారం గ్రామనికి చెందిన సూతారి రామన్న ఇటీవల ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబాన్ని కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

నోట్ బుక్కుల పంపిణీ

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో య్రైటింక్లైన్ కాలనీకి చెందిన లక్ష్మి బుక్ సెల్లర్ నిర్వాహకులు వరమణి లక్ష్మణ్ విద్యార్థులకు శుక్రవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మండలంలోని పెంచికల్‌పేట్‌కు చెందిన సీరారపు శ్రీకాంత్ కుటుంబం ప్రమాదంలో గాయపడగా వారి కుటుంబాన్ని, అనారోగ్యంతో బాధపడుతున్న ఎద్దు రాజయ్య, తాటికొండ రాజయ్యను పరామర్శించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్ల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వడ్నాల శ్యామ్‌కుమార్ తన అన్న వడ్నాల శశికుమార్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం బ్యాగులు పంపిణీ చేశారు.

అభినందన పత్రం అందజేత

రామగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలో మాదారపు మమత ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబసభ్యులు సదాశయ ఫౌండేషన్‌కు కళ్లను దానం చేశారు. శుక్రవారం సెంటినరీకాలనీలోని నిర్వహించిన మమత సంస్మరణ సభలో కేశవరావు కుటుంబానికి లయన్స్ క్లబ్, సదాయశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అభినందనపత్రాన్ని అందజేశారు.

పెనాల్టీ విధింపుపై ధర్నా

రామగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ విధింపును నిరసిస్తూ శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కాంట్రాక్టు కార్మికుడు ఒక్క రోజు విధులకు గైర్హాజరైతే రూ. 720 రికవరీని నిరసిస్తూ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి జీఎంకు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఆకుల వెంకన్న, అశోక్, రమేశ్, నర్సయ్య, మొండయ్య, లింగయ్య, ఓదెలు, లక్ష్మి, మోహన్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

రామగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి అదనంగా మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవోకు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు మల్యాల మోహన్, జనగామ రవికుమార్, కొండు లక్ష్మణ్, జాపతి శేఖర్‌లు వినతి పత్రం అందజేశారు.

పుట్ట శైలజను సన్మానించిన కేటీఆర్

మంథని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజను బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో ప్రగతి భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ల సన్మాన కార్యక్రమంలో భాగంగా పుట్ట శైలజను శాలువాతో కేటీఆర్ సన్మానించారు.

నేడు రేషన్ బియ్యం వేలం

మంథని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాం వద్ద శనివారం వేలం వేయనున్నట్లు మంథని డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరి శుక్రవారం తెలిపారు. బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తక్కువ కాకుండా బహిరంగ వేలం అమ్మటానికి అర్హత, ఆసక్తి కలిగినవారు రూ. 2వేల ధరవత్తుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చొన్నారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

కమాన్‌పూర్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన దాసరపు తిరుపతి(48)అనే వ్యక్తి ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి గుండారం రిజర్వాయర్ వద్ద గల ప్రకృతివనంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కొట్టే ప్రసాద్ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

విద్యాప్రమాణాలు పెంచడంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచడంపై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత కలెక్టరేట్‌లో 36కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో, 14మండలాల ఎంఈవోలు, పెద్దపల్లి, ఓదెల మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత హెడ్ మాస్టర్లతో ఎఫ్‌ఎల్‌ఎన్ మిడ్‌లైన్ టెస్ట్ ఫలితాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్‌లలో రాసి, చదివే సామర్థ్యాలను పెంచాలని, గణితంలో కనీస సామర్థ్యం ఉండేలా దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, జిలా సమగ్రశిక్ష సమన్వయకర్త పీఎం షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం: సీపీ

కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కుటుంబాలకు ఏసమస్య వచ్చినా అండగా ఉంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో ఏఆర్ ఏసీపీగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సుందర్‌రావు, గోదావరిఖని వన్‌టౌన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన శారదను ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులను ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఏవో శ్రీనివాస్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు వామనమూర్తి, సంపత్, ఆర్‌ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, సరిత, అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, స్వామి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు

ఓదెల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి కొరత లేకుండా ఇప్పటినుంచే తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో తిరుపతి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తాగునీటి ఎద్దడి నివారణపై కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి ఉధృతం కాకముందే తగు చర్యల చేపట్టాలన్నారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీవో షబ్బీర్ అలీ, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్‌రావు ఆదేశించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సంబంధిత భగీరథ తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మిషన్‌భగీరథ డీఈ సతీష్, ఎంపీవో ఎండీ ఆరీఫ్, గ్రిడ్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలకుర్తి: వచ్చే వేసవి కాలంలో ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీవో ఉప్పు సుదర్శన్ సూచించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో మిషన్ భగీరథ డీఈ సునీల్, ఏఈ అఖిల, గ్రిడ్ ఏఈ వివేక్, పంచాయతీ కార్యదర్శులతో ప్రతేక సమావేశం నిర్వహించారు.

సెగ్రిగేషన్ తయారీ కేంద్రాల సందర్శన

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


లాలపల్లిలో సెగ్రిగేషన్ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో గల సెగ్రిగేషన్ షెడ్లను ఎంపీవో ఎండీ ఆరీఫ్ శుక్రవారం పరిశీలించారు. 'నిరూపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు' అనే కథనం జనవరి 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. కథనానికి ఎంపీవో స్పందించి షెడ్లను పరిశీలించారు. షెడ్లను రైతులకు ఉపయో గకరంగా ఉంచాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు.

'ఇందిరమ్మ ఇంటి కోసం రూ. 3 వేలు వసూల్'

ధర్మారం జనవరి 31 (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూల్ చేస్తున్నట్లు మండలంలో చర్చసాగుతోంది. మేడారం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మహ్మద్ షాబొద్దీన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. పూరి ఇంట్లో ఉంటూ నలుగురు ఆడపిల్లలతో చిన్న దుకుణం నడపించుకుంటూ కాలం వెల్లదీస్తున్నాడు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుకున్నాడు. ఈ విషయాన్ని పసిగట్టిన అదే గ్రామానికి మరో కాంగ్రెస్ నేత షాబొద్దీన్‌ను ఒకటికి రెండుసార్లు కలిసి ఇల్లు ఇప్పిస్తానని 3వేలు లంచం తీసుకున్నట్లు చెప్పిన వీడియోను బీఆర్‌ఎస్ పార్టీ శుక్రవారం మీడియాకు అందించడం చర్చనీయంశమైంది.



జీఎంలు, ఫారెస్టు అధికారులతో సీఎండీ సమీక్ష


సీఎండీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ-1 అధికారులు

గోదావరిఖని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ బలరాంనాయక్, సలహాదారులు (ఫారెస్ట్) పర్గెన్ శుక్రవారం అన్ని ఏరియాల జీఎంలతో, జీఎం(సీపీపీ), జీఎం(ఎస్టేట్), జీఎం ఎన్విరాన్‌మెంట్, జీఎం (ఫారెస్టు), అన్నీ ఏరియాల ఎస్టేట్, ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంతో అనుసంధానించిన అటవీ భూమి మళ్లింపులు, అటవీ, పర్యావరణ క్లియరెన్స్ మొదలైన వాటికి సంబంధించిన వివిధ పనులపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-1 నుంచి ఎస్‌టుటూ జీఎం గోపాల్‌సింగ్, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, డీజీఎం ఎస్టేట్ కుమార స్వామి, డీజీఎం (ఫారెస్టు) కర్ణ, సీనియర్ సెక్యూరిటి ఆఫీసర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వకీల్‌పల్లి పిట్ కమిటీ

య్రైటింక్లయిన్‌కాలనీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి వకీల్‌పల్లి మైన్ టీబీజీకేఎస్ పిట్ కమిటీ శుక్రవారం ఎన్నికయ్యింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి హాజరై మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేయాలన్నారు. పిట్ సెక్రెటరీగా వెంకటేశం, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా శ్రావణ్, సలహాదారులుగా ఆవుల రాములు, సిరిశెట్టి రాములు, రాజారాం, బిక్షపతి, ఖాసీం, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, టెక్నికల్ ఇంచార్జీ గంగాదర్, కోశాధికారిగా మనోజ్, ఆర్గనైజర్స్‌గా గౌరీ శంకర్, ప్రశాంత్, అజయ్, సుజిత్‌రెడ్డి, రి లేడీ ఇన్‌చార్జిగా రామ్‌చరణ్, షిఫ్ట్ ఇన్‌చార్జిగా సాగర్, వేణు, వినోద్, నాగేష్, రంజిత్, మహేందర్, సదానందం, తిరుమల, కుమార్, సుమన్, శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, కేంద్ర జాయింట్ సెక్రెటరీ అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, రవితేజ, ఏరియా కమిటీ సభ్యులు శ్రీనివాస్, మల్లేష్‌నాయక్, సురేందర్, అజయ్ పాల్గొన్నారు.

ఓసీపీ-5లో కార్మికుల నిరసన

గోదావరిఖని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీడీకే ఓసీపీ-5లో ప్రీ షిఫ్టు అనగా ఉదయం షిఫ్టుల్లో విధులు నిర్వహించే కార్మికులను క్యాంటీన్‌లో ఎలాంటి ఆహార పదార్థాలు ఇవ్వరాదంటూ బయటకు నెట్టివేసి తాళం వేశారని కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. మేనేజర్ అనిల్ గబాలే ఇచ్చిన ఆదేశాలను పాటిస్తున్నామంటూ క్యాంటీన్ క్లర్క్ పేర్కొన్నట్టు కార్మికులు తెలిపారు. మాకు ఉన్నటువంటి రెస్ట్ షెల్టర్ గతంలో తాము ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న భోజనం భోజనవిరామ సమయంలో తినేవారమన్నారు. కానీ ఇటీవల రెస్ట్ షెల్టర్‌ను ఇతరులకు కేటాయించడంతో భోజనం చేసే పరిస్థితి లేదని తెలిపారు. తాము క్యాంటీన్‌లో భోజనం చేయడానికి వెళితే క్లర్క్ సిబ్బందితో బయటకు గెంటి వేయించి తాళం వేసుకున్నారన్నారని కార్మికులు తెలిపారు. ఈ విషయంపై సీఎండీ చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

మరమ్మతుకు నోచుకోని విద్యుత్ మోటర్

- ఇంకుడుగుంతలోని నీటితో మధ్యాహ్న భోజన వంటలు
- నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి

ఓదెల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో బోరుబావికున్న విద్యుత్ మోటార్ పాడైపోయింది. దీంతో ఇంకుడుగుంతలో నిల్వ ఉన్న నీటితో మధ్యాహ్న భోజనాన్ని తయారుచేస్తున్నారు. బోరుబావి కున్న విద్యుత్ మోటార్ పాడైపోయి నెలరోజులు గడుస్తోంది. దీంతో వంటలు తయారు చేయడానికి మంచినీటి కొరత ఏర్పడడంతో ఈ విషయంపై విద్యార్థులు, వంట తయారీ ఏజెన్సీ మహిళలు ప్రధానోపాధ్యాయురాలికి తెలిపారు. విద్యుత్ మోటార్‌ను మరమ్మతు చేయకుండా నెలరోజుల నుంచి పాఠశాల వెనుక భాగంలో ఉన్న ఇంకుడు గుంతలో నిల్వ ఉన్న కలుషిత నీటితో భోజనం, కూరలు తయారు చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వంటకు వినియోగిస్తున్న నీటిపై దోమలు, ఆకులు

ప్రతీరోజు 50 నుంచి 60 మంది విద్యార్థులు ఇదే కలుషితమైన నీటితో తయారు చేసిన భోజనాలను తింటున్నారు. కుళాయిలోని నీటిపై చెత్త పేరుకుపోయి, దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ, అదే నీటిని వినియోగించుకోవాలని సంబంధిత తనిఖీ అధికారి తెలుపుతూ ఉండడంతో విధిలేని పరిస్థితిలో ఏజెన్సీ మహిళలు అదే నీటిని భోజనం తయారీకి వినియోగిస్తున్నారు. వెంటనే విద్యుత్ మోటార్‌ను మరమ్మతులు చేసి మధ్యాహ్న భోజనం తయారీకి మంచినీటిని అందించాలని విద్యార్థులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం: మంత్రి

మంథని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథని ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికకాగా గురువారం రాత్రి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధుల మంజూరు, సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. మంత్రి శ్రీధర్ బాబును క్లబ్ పక్షాన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, కోశాధికారి తగరం రాజు, సభ్యుడు డొరగోర్ల రవీందర్ పాల్గొన్నారు.


భూ పంపిణీకి ఎస్సీ కమిషన్ ఆదేశం

ఓదెల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడకలో గత డిసెంబర్‌లో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని హైదారాబాద్ నుంచి ఎస్సీ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు లెటర్ ద్వారా తెలుపుతూ, మడక గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసి నిరుపేదలైన ఎస్సీలకు భూమిని పంపిణీ చేయాలని కోరారు. కొన్ని రోజుల నుంచి ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోశిక రాజేశం ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ కమిషన్‌తోపాటు ఉన్నతాధికారులను కలిసినట్టు రాజేశం తెలిపారు.

'గుడి నిర్మాణ దాతల పేర్ల ధ్వంసంతో సంబంధం లేదు'

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణం పెద్దమ్మతల్లి ఆలయంలో గుడి నిర్మాణ దాతల పేర్లు ధ్వంసంతో నాకెలాంటి సంబంధం లేదని మాజీ కౌన్సిలర్, ముదిరాజ్ సంఘం నాయకులు బూత గడ్డ సంపత్ తెలిపారు. పెద్దపల్లి ఆర్యవైశ్య భవన్ లో శుక్రవారం ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ఆయన భార్య శంకరమ్మ పేర్లు పెద్దమ్మతల్లి ఆలయం గోడలపై నిర్మించడాన్ని సంఘ సమావేశాల్లో అనేకసార్లు వ్యతిరేకించారని తెలిపారు. సంఘంలోని సభ్యులు చేసిన పనిని తనకు అంటగట్టడం మాజీ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ దివాలకోరుతనానికి నిదర్శనమన్నారు.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిది


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి అన్నారు. గద్దర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాడిత, పీడిత ప్రజలకోసం గద్దర్ నిరంతరం పోరాటం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో గజ్జెకట్టి తన పాటలతో తెలంగాణ ప్రజలను చైతన్యపర్చడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, కౌటం సతీష్, దూళికట్ట సతీష్, దాసరి సాంబమూర్తి, కొప్పుల శంకర్, ఫజల్‌బేగ్, గట్ల రమేష్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. 30ఏళ్లుగా ఒక్క యాక్సిడెంట్ కూడా లేకుండా బస్సులను నడిపిన భూమయ్య, తిరుపతి, జగన్‌లను ఘనంగా సత్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు